# అమరావతి కథలు
సత్యం శంకరమంచి



## గాయత్రి

ఐదు తరాల కిందట—

వేంకటాద్రి నాయనిం వారు అమరేశ్వరాలయ నిర్మాణం పూర్తి చేశారు. రేపో మాపో స్వామి కల్యాణం. హజారంలో పన్నెండు కొట్టినా నాయుడుకి నిద్రపట్టలేదు. దేవాలయ నిర్మాణం అఖరున నిన్న ఉదయం తూర్పు దిశగా ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఆ ధ్వజస్తంభం ఎత్తుగా కృష్ణంతటినీ చూస్తు ఠీవిగా ఉంది. ఆ ఎత్తయిన ధ్వజస్తంభాన్ని తలుచుకుంటే తన కీర్తి దేశమంతటా వ్యాపించినట్టు ఓ పిసరు గర్వరేఖ తోచింది.

హజారంలో ఒంటిగంట కొట్టారు.

"అయ్యో! పన్నెండు గంటలు మోగిన గంట కాస్సేంతలో ఒకే ఒక్క గంట మోగిందే! నా కీర్తి నలుపక్కలా పాకిపోయిందనుకున్నానే కాని నా చేతనైనంత స్వామిసేవ చేస్తున్నాననుకోలేదే!" అనిపించటంతో నాయుడిలోని గర్వరేఖ మాయమయిపోయింది. చేతులు ముకుళించి శయ్యమీదే కూర్చుండిపోయాడు.

కూర్చుండలేక శయ్యదిగి అంతఃపురం దాటాడు. అంతఃపురందాటి ప్రాకారం వెలుపలకు వచ్చాడు. వెంబడనున్న అంగరక్షకులు వెంటరాబోగా వద్దని వారించి వెనక్కు వెళ్ళమన్నాడు.

ఆరుబయలులో కొచ్చి నుంచున్నాడు. పైన వెన్నెల పందిట్లో మెరుస్తున్న చుక్కలు. చుట్టూతా నిద్రపోతున్న పట్టణం-దూరంగాకృష్ణమ్మ గలగల. ఆ గలగలకు తోడుగా మువ్వల సవ్వడి విన్పించింది. ఆ సవ్వడికి ఉలిక్కిపడి నాలుగు పక్కలా చూశాడు. మళ్ళీ గాలిలో చిరు గంటల చప్పుడు. తలపైకెత్తి చూస్తే ధ్వజస్తంభానికున్న చిరు గంటలు గాలికి ఊగుతూ మోగుతున్నాయి.

ఆ వెన్నెల!
ఆ నిశ్శబ్దం!
ఆ నిశ్శబ్దంలో మువ్వల సవ్వడి!
ఆ సవ్వడికి లేచిన రామచిలకలు
కుహూ కుహూలు!

నాయుడు కదిలిపోయాడు. ధ్వజస్తంభం వైపు నడిచిపోయాడు. గంటలు గాలికి నృత్యంచేస్తూ ఊగుతున్నాయి. ఆ ధ్వజస్తంభం నీడన ఓ ఒక్కమనిషి పద్మాసనం వేసుకుని జపం చేసుకుంటున్నాడు.

ఆ మనిషి నిద్రపోవటంలేదు. పక్కనే అతని ఇల్లాలు, ఆరుగురు పిల్లలు పడుకుని ఉన్నారు. ఆ వ్యక్తి ముఖంలో తేజస్సు! కళ్ళు తెరవడు! పెదవి విప్పడు! గాలిలో గాయత్రి మంత్రం మోగుతోంది. నాయుడు అలాగే నిల్చుండిపోయాడు. తెలతెలవారుతుండగా అంతఃపురానికొచ్చి వాళ్ళని తీసుకురమ్మని కబురుపెట్టాడు.

ధ్వజస్తంభం దగ్గర ప్రత్యూషాన కళ్ళు తెరిచాడు వేదాంతం లక్ష్మీపతి శాస్త్రిగారు. ఆయన చతుర్వేదాలు పుక్కిట పట్టినవాడు. వేదసారమంతా గాయత్రిలో ఉందని గ్రహించి ఆ మంత్రాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా జపిస్తూ జంధ్యాలు వడుకుతూ అందరికీ పంచిపెడ్తుండేవాడు. తనకైతే గాయత్రి మనసునిండా ఉంది మరేం అక్కరలేదు. కట్టుకున్న ఇల్లాలికి, కడుపున పుట్టిన పిల్లలకో! మార్గం తెలిసింది కాదు. ఆ గాయత్రిదేవే చూసుకుంటుందని ఊరూవాడా తిరుగుతూ స్వామి కల్యాణ సమయానికి అమరావతి చేరుకున్నాడు. కిందటిరాత్రి పిల్లలూ తనూ పచ్చివి వేరుశనక్కాయలు తిని మంచినీళ్ళు తాగారు.

ఎదురుగా భటులు.

ప్రభువు రమ్మంటున్నాడని పిలుపు.

కృష్ణా స్నానం చేసి వస్తానని కబురు పెట్టారు లక్ష్మీపతిశాస్త్రి. ఆ జవాబు అంతగా రుచించలేదు నాయుడికి.

అప్పటికే సభ తీర్చిన నాయుడు ముందుకి. స్నానం జపం ముగించుకున్న లక్ష్మీపతిశాస్త్రి వచ్చి నుంచుని 'శివాయ నమః' అని వందనంచేశాడు.

నాయుడు 'తనకు వందనం చేయలేదేమో' అని మనసున భావించాడు. కాని ఎదురుగాలి తేజఃపుంజం. నాయుడు కావాలని అన్నాడు, "ప్రభువుల వద్దకు వస్తూ ఏమి కానుక తెచ్చారు?" అని.

లక్ష్మీపతిశాస్త్రి తబ్బిబ్బయినాడు. తన దగ్గర ఏమి కానుక ఉంటుంది. ఏమివ్వగలడు? సభ అంతా తనవైపే చూస్తోంది. ఒకచేయి జోలెలోకి పోనిస్తే నిన్నతిన్న వేరుశనక్కాయ తొక్కలు తగిలాయి. మళ్ళీ చెయ్యి పెట్టాడు. యజ్ఞోపవీతం తగిలింది. కళ్ళు మూసుకుని వేరుశనక్కాయ తొక్కని భద్రంగామూసి "శివార్పణమ్! ఇది నా కానుక" అని భక్తితో నాయుడుకి సమర్పించాడు.

'వేరుశనక్కాయ కానుకా!' సభ విస్తుపోయింది.

నాయుడి శనక్కాయని విప్పిచూశాడు. కళ్ళు మిరుమిట్లు గొల్పాయి. అందులో వజ్రవైఢూర్యాలు లేవు. తాను స్వయంగా వడికిన యజ్ఞోపవీతం ఉంది. అందులో ఇమిడిపోయివుంది. నాయుడు దిగ్గున లేచి వచ్చి పాపయారాధ్యులకు చూపించి 'చూశారా కానుక' అన్నాడు.

పాపయారాధ్యుల ముఖాన చిరునవ్వు.

'రేపు అమరేశ్వర కల్యాణానికి రావాల్సిన యజ్ఞోపవీతాన్ని స్వామి ఇలా సంతరించుకున్నాడు' అంటూ లక్ష్మీపతి శాస్త్రిగారిని ఆసనంమీద కూర్చోపెట్టి "మీకేం కావాలో కోరుకోండి" అన్నాడు.

లక్ష్మీపతిశాస్త్రిగారు నవ్వి నాకై ఏ కోరికలూలేవు. మళ్ళీ మమకారాలేం? నా సంతతి పెరిగి పెద్దయ్యేదాకా ఏదన్నా ఆధారం దొరికితే అదే ఈశ్వర ప్రసాదం" అన్నాడు.

నాయుడు లక్ష్మీపతిశాస్త్రికి కుంచవరం అగ్రహారం ఈనాముగా ఇచ్చాడు. కాని లక్ష్మీపతిశాస్త్రి ఆ ఈనాము అనుభవించాడా? నాకెంత కావాలి? అనుకుంటూ ఆ దుమ్ములూ దుబ్బులూ కొట్టించి పండించి సంత పండించి పదిమందికీ ఇంత పెడ్తూ అందరికీ జంధ్యాలు పంచిపెడ్తూ కాలం వెళ్ళబుచ్చాడు.

